# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **రాష్ట్రంలోని జిల్లా, మండలం, గ్రామాల పేర్లు సరిహద్దు మార్పులపై సూచనలు చేసేందుకు ఏర్పాటైన మంత్రుల కమిటీ ఈరోజు సమావేశమైంది.**

**2.** **రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన విద్యాసంస్థల్లో నులిపురుగుల నివారణా కార్యక్రమం చేపడుతున్నామని మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ తెలిపారు.**

**3.** **ప్రకాశం బ్యారేజ్‌కు వరద నీరు చేరుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.**

4. **రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు.**

**5.** **రాష్ట్రంలోని మూడు శాఖల్లో 21 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.**

=========================

రాష్ట్రంలోని జిల్లా, మండలం గ్రామాల పేర్లు సరిహద్దు మార్పులపై సూచనలు చేసేందుకు ఏర్పాటైన మంత్రుల కమిటీ ఈ రోజు సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరిగే ఈ సమావేశంలో పలు జిల్లాలు, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల్ని మార్చాలంటూ ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల్ని పరిశీలించి చర్చిస్తుంది. అనంతరం పరిపాలనాపరమైన ఏర్పాట్లు, వనరుల లభ్యత, సాంస్కృతిక అంశాల్ని పరిగణనలోకి తీసుకుని.. సరిహద్దులు, పేర్లు మార్పునకు సంబంధించి సూచనలు చేయనుంది.

-------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన పాఠశాలలు, కళాశాలల్లో నులిపురుగుల నివారణా కార్యక్రమం చేపడుతున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గంలోని వడిశలేరులో కోటి రూపాయలతో నిర్మించే కచ్చా రహదారికి మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ,

వాయిస్..24 సెకన్లు

-------------------------

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో విజయవాడ ప్రకాశం బ్యారేజీకి వరద నీరు వచ్చి చేరుతోంది. ఈ రోజు ఉదయానికి 2 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరిందని, సాయంత్రానికి 3 లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. దీంతో బ్యారేజీ 65 గేట్లు 4 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

మరోవైపు ప్రకాశం బ్యారేజ్‌కు వరద నీరు భారీగా వస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రెవెన్యూశాఖ అధికారులతో మంత్రి ఈరోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరద ముంపు కాలనీల్లో వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని, అవసరమైతే ప్రజలను ఖాళీ చేయించి, పునరావాస కేంద్రాలకు తరలించేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజల సహాయార్థం విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు.

---------------------------

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఈ రోజు జాతీయ పతాకాలతో మోటార్ సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ బి. శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ, ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగుర వేసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోవాలన్నారు. నంద్యాలలోని మార్కెట్ యార్డు నుండి గాంధీ చౌక్ వరకు 300 అడుగుల జాతీయ జెండాతో నిర్వహించిన ర్యాలీలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఈ రోజు పాల్గొన్నారు. హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

రాజధాని అమరావతిలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసన సభాపతి సి. హెచ్. అయ్యన్న పాత్రుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభాపతి మాట్లాడుతూ.. ఈ ఆసుపత్రి నిర్మాణం ద్వారా రాష్ట్ర ప్రజలకు క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి రానుందని తెలిపారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ, 750 కోట్ల రూపాయలతో 500ల పడకల సామర్థ్యంతో అత్యాధునిక వైద్య పరికరాలతో నిర్మాణం చేపట్టామన్నారు. మొత్తం 21 ఎకరాల్లో మూడు దశల్లో ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా అభివృద్ధి పనులు వేగవంతమైయ్యాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ తెలిపారు. నెల్లూరు నగరంలోని వేదయపాలెంలో ఈరోజు జరిగిన ఛాయ్ పే చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సెమీ కండక్టర్ యూనిట్‌ను మంజూరు చేసిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి ఒక రూట్ మ్యాప్‌తో ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి విమర్శించారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ...

..వాయిస్... 33 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని మూడు శాఖల్లో 21 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ – ఏపీపీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. వ్యవసాయ శాఖలో 10 పోస్టులకు ఈనెల 19 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. దేవాదాయశాఖలో 7 ఈఓ పోస్టులకు, భూగర్భ జల విభాగంలో 4 సాంకేతిక సహాయకుల పోస్టుల కోసం ఈరోజు నుంచి సెప్టెంబరు 2వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నామని ఏపీపీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ రోజు లాభాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 351 పాయింట్ల లాభంతో 80 వేల 588 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 144 పాయింట్ల లాభంతో 24 వేల 631 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈ ఉదయం అల్పపీడనం ఏర్పడిందని ఇది వాయవ్య దిశగా కదులుతూ రానున్న 24 గంటల్లో మరింత బలపడనుందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఈ రోజు, రేపు కోస్తా జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ,

వాయిస్ ..28 సెకన్లు

======================